క్లుప్తంగా

నర్సింగ్ కళాశాలలో సంబరాలు



సంబరాలు చేసుకున్న నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్

దెందులూరు: పాకిస్తాన్‌పై టీమిండియా సాధించిన విజయాన్ని ఎన్నటికీ మరువలేమని దెందులూరు మండల వాకర్ అసోసియేషన్ నేత రామదండు, నాయకులు బొడ్డు హేమంత్ అన్నారు. సోమవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో గ్రామంలోని చిన్నారులు, గ్రామస్తులు టీమిండియా జట్టు చిత్రపటంపై పాలాభిషేకం చేసి, సంబరాలు చేసుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం



టీచర్ జ్యోతిని సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: అంకితభావం ఏ రంగంలో అయినా గుర్తింపు తెస్తుందని దెందులూరు సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య, రిటైర్డ్ టెరిటోరియల్ కమాండర్ జోషియా, తెలంగాణ హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ పల్లె హర్షవర్ధన్ సిలువకుమారి అన్నారు. సోమవారం దెందులూరు గౌడ వీధిలోని సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చిలో ఇటీవల బెస్ట్ టీచర్‌గా అవార్డు పొందిన కొత్తపల్లి జ్యోతిని సత్కరించారు.

తగ్గింపు ధరలకు అమ్మాలి

ఉంగుటూరు: వర్తకులు తగ్గిన ధరలకే వస్తువులను అమ్మాలని ఉంగుటూరు ఎంపీడీవో జీఆర్ మనోజ్ అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రచారంలో భాగంగా సోమవారం ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు ఉపాధి హామీ పథకం ఏపీఓ హౌసింగ్ ఏఈ ఉపాధి హామీ మెట్లు ఉంగుటూరు సచివాలయ కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుని దర్శించుకున్న మంత్రి పార్థసారథి



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న మంత్రి కొలుసు పార్థసారథి

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో వేంచేసియున్న అభయాంజనేయ స్వామిని మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్‌గా నియమితులైన వేమూరి శ్రీనివాసరావును కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే చంటి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాగునీటిపై దృష్టి సారించాలి

నిడమర్రు: గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటి పంపిణీపై ఆయా గ్రామ పంచాయతీలు దృష్టి సారించాలని స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఎంపీపీగా ఎంపికైన ధనుకొండ ఆదిలక్ష్మిని, ఈవోపీఆర్డీ స్వామిని ఎమ్మెల్యే ధర్మరాజు ఘనంగా సత్కరించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



వెంకట సుబ్బాయమ్మ(ఫైల్)

గణపవరం: గణపవరం గ్రామానికి చెందిన పువ్వాడ వెంకట సుబ్బాయమ్మ(105) శతాధిక వృద్ధురాలు ఆదివారం ఉదయం మృతి చెందారు. ఈ విషయాన్ని ఆమె ముని మనుమడు పువ్వాడ కిషోర్ తెలిపారు. ఈమెకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం కాగా మనుమలు, ముని మనుమలు ఉన్నారు. వారం రోజులుగా ఈమె నీరసించడంతో మనుమలు సంరక్షణ బాధ్యతలు చూస్తుండగా ఆదివారం రాత్రి మరణించారు.

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ

చింతలపూడి: ఏపీ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఎస్.శ్రీదేవి సోమవారం చింతలపూడి సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నిందితుల కేసుల వివరాలు వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు మంచినీటి సౌకర్యాలను పరిశీలించారు. అదే విధంగా సబ్‌జైలులో అనారోగ్యంగా ఉన్న నిందితుల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, జైలు సూపరింటెండెంట్ కృపానందం, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు ఆర్థిక భరోసా

- సచివాలయాల్లో ఈ-శ్రమ్ ఉచిత నమోదు
- ప్రతి కార్మికుడు నమోదు చేయించుకోవాలి



పెదవేగి మండలంలో పని చేస్తున్న ఉపాధి కూలీలు

పెదవేగి: కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ నమోదు సచివాలయాల్లో అందుబాటులో ఉంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రతి సచివాలయంలో ఈ గ్రామ పోర్టల్‌లో ఉచితంగా నమోదు చేస్తున్నారు. అసంఘటిత కార్మిక రంగంలో పని చేస్తున్న వారి సమాచారం (డేటాబేస్) సేకరించడమే ఈ-శ్రమ్ ప్రధాన లక్ష్యం. దీంతో పాటు ప్రభుత్వ పథకాలు, ఆర్థిక సాయం, నష్ట పరిహారం నేరుగా కార్మికులకు అందించేందుకు దోహదపడుతుంది. పోర్టల్లో అసంఘటిత కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకుంటే విపత్తు సంభవించినప్పుడు ఈ ప్రాంతంలో ఎంతమంది ఉన్నారన్న విషయం క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఈ-శ్రమ్ గుర్తింపు కార్డు ఉంటే కార్మికులు ప్రభుత్వ పథకాలను సులువుగా పొందొచ్చు. ఇది దేశంలో ఎక్కడైనా పని చేస్తుంది.

ఈ-శ్రమ్ కార్డు ఉంటే..

ఈ-శ్రమ్ గుర్తింపు కార్డు ప్రభుత్వం జారీ చేస్తుంది. ఆధార్ నంబర్‌లా దేశ వ్యాప్తంగా కార్మికుడికి ఒక గుర్తింపు సంఖ్య ఉంటుంది. 12 అంకెల నంబర్‌తో గుర్తింపు కార్డు ఇస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు అనేక పథకాలు ప్రారంభిస్తున్నప్పటికీ చాలా మంది వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదుచేసుకుంటే కార్మికుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే ఆర్థిక సాయం నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాకు జమ కానుంది. మెరుగైన ఉపాధి అవకాశాలకు నైపుణ్యాల అభివృద్ధికి సహాయం లభిస్తుంది. అసంఘటిత రంగానికి చెందిన కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదుచేసుకుంటే వారికి రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం లభిస్తుంది. ఈ-శ్రమ్ గుర్తింపు పొందిన కార్మికుడు ప్రమాదానికి గురై మరణిస్తే రూ.2 లక్షలు బీమా సంస్థ చెల్లిస్తుంది. అంగవైకల్యం పొందితే రూ.1 లక్ష లభిస్తుంది.

నేటివరకు 7,128,967 నమోదు..

ఆగస్ట్ 2021వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ-శ్రమ్ పథకం నేటి వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 7,128,967 మంది కార్మికులు నమోదు చేసుకోగా, పశ్చిమగోదావరిలో 6,092712, ఏలూరు జిల్లాలో 1,03,6255 మంది నమోదు చేసుకున్నారు.

ఈ-శ్రమ్‌లో నమోదు కావాలంటే

- ఈ-శ్రమ్ పోర్టల్లో రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి రుసుం చెల్లించనక్కర్లేదు.
- అర్హులైన వారు సమీప సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవచ్చు.
- ఈ పథకంలో నమోదు కోసం ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ నంబర్, సెల్‌ఫోన్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది.
- కేంద్ర ప్రభుత్వంఇచ్చే ఆర్థికసాయం నేరుగా కార్మికులు, నామినీ అకౌంట్‌కు జమ అవుతుంది.
- వివరాలకు జిల్లా ఉప కార్మికశాఖ కార్యాలయంలో బేటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను సంప్రదించవచ్చు.

ప్రతి కార్మికుడు నమోదు చేయించుకోవాలి



ప్రభుత్వం సామాన్య ప్రజానీకానికి సాయం అందించేందుకు ఈ-శ్రమ్ ప్రవేశపెట్టింది. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా ఇది నమోదు చేసుకోవాలి. ఇందులో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదంలో ఏ అవయవాలైన కోల్పోయినట్లయితే నష్ట శాతం ఆధారంగా రూ.1 లక్ష ఇన్సూరెన్స్ వస్తుంది. భవిష్యత్‌లో ఈ పథకాన్ని మరింత బలోపేతం చేయనున్నారు.

– గంజి వెంకట రమణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, ఏలూరు జిల్లా

అసంఘటిత కార్మికులు ఎవరంటే..

భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ రంగ కూలీలు, ఇళ్లు, దుకాణాల్లో పని చేసే కార్మికులు, కొరియర్ బాయ్స్, తోపుడు బండి కార్మికులు, వలస కార్మికులు, డొమెస్టిక్, ఆగ్రికల్చర్ వర్కర్స్, స్ట్రీట్ వెండర్స్, ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీ వర్కర్లు, మత్స్య కార్మికులు, ప్లాంటేషన్ వర్కర్స్, పాల వ్యాపారులు, చిరు వ్యాపారులు, ట్యూషన్ టీచర్లు, చేతి వృత్తుల వారు, కార్పెంటర్లు, ప్లంబర్లు ఇలా అనేక రకాల పనులు, చేసి వారు అసంఘటిత రంగంలోకి వస్తారు.

అధ్వానంగా శ్రీరామవరం రహదారి



గుంతలతో అధ్వానంగా ఉన్న రహదారి

దెందులూరు: శ్రీరామవరం సీతంపేట మధ్య రోడ్డు కోతకు గురైందని ఈ రోడ్డుపై ప్రతిరోజు రెండు మండలాలకు సంబంధించి రైతులు, వ్యాపారస్తులు, కూలీలు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు కోతకు గురవటమే కాకుండా వర్షపు నీరు నిల్వ ఉండటం వలన ఆ ప్రాంతం పెద్ద గుంత ఏర్పడింది. దీనికి తోడు కరెంటు లేకపోవడంతో రాత్రి వేళల్లో అనేక సార్లు వాహనాలు ఆ గుంతల్లో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముంపు పొలాల పరిశీలన

పోలవరం రూరల్: కొండవాగుల నీటితోపాటు గోదావరి నీరు తోడు కావడంతో పోలవరంలో ముంపునకు గురైన పంట పొలాలను మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాంబాబు, సోమవారం రైతులతో కలిసి పరిశీలించారు. పోలవరం నుంచి కచేరికి వెళ్లే రోడ్డు మార్గంలో సుమారు 240 ఎకరాలు నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశామని తెలిపారు. గోదావరి వరద పూర్తిగా తగ్గితే తప్ప నీరు మొత్తం నదిలోకి చేరే పరిస్థితి లేదని అప్పటికి పొలాలు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు తెలిపారు.

అరాచకాలకు మూల్యం చెల్లించక తప్పదు



డిజిటల్ బుక్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వాసుబాబు, పార్టీ నేతలు

గణపవరం: అధికారం చేతిలోఉంది కదా అని కూటమి నేతలు అరాచకాలకు పాల్పడుతూ వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు, దాడులకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించక తప్పదని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు హెచ్చరించారు. సోమవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఇటీవల పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రారంభించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకు పార్టీ తరపున డిజిటల్ బుక్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు అండగా ఉండటం కోసమే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కొత్త వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి నడింపల్లి సోమరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దండు రాము, సంకు సత్యకుమార్, కోడే కాశీ, కమ్మిల భాస్కరరాజు, దండు గోపిరాజు, తలమంటి వెంకటేశ్వర్లు, కొట్టు నరేష్, జీవీ గాదిరాజు, కర్రి శ్రీనివాసరెడ్డి, సంకు శ్రీనివాసరావు, అలుమోలు గంగారాం, మీసాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సరళంపై అవగాహన

పెదవేగి: కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్నులను సరళతరం చేసిందని దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ రవికుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజలకు జీఎస్టీ సంస్కరణల ఫలితంగా తగ్గిన ధరలు, జీఎస్టీ శ్లాబులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ అల్లి, పంచాయతీ కార్యాదరి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో మేలు

గణపవరం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు కలుగుతుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం గణపవరంలో జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలు వివరించడానికి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడివో బేబీ శ్రీలక్ష్మి, సర్పంచ్ మూర అలంకారం, తోటశ్రీను, కూనసానినాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య భరోసా



భీమడోలు: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



గణపవరం: రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ మహిళలకు ఆరోగ్య భరోసా అని కంటి వైద్య నిపుణులు వెంకటరెడ్డి అన్నారు. భీమడోలులో సోమవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 314 మందికి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేశారు. 22 మందికి కేన్సర్ పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, రక్తహీనత, హీమోగ్లోబిన్, కంటి పరీక్షలు ఇతర పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందించారు. తొలుత పలు శాఖల సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. శిబిరాల నిర్వహణకు సహాయ సహకారాలు అందించిన పంచాయతీ కార్యదర్శి కేవీఎల్ తనూజను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కుక్కల ప్రసాద్, పైడిమాల యుగంధర్, సీహెచ్‌వో ఇందిర, డీవైహెచ్‌ఈవో మధుసూధనరావు, ఎంఎల్‌హెచ్‌పీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

గణపవరం: ప్రస్తుత పరిస్థితులలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపాలని బీజేపీ బిజెపి ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి అన్నారు. సోమవారం గణపవరం మండలం కేశవరంలో బీజేపీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. 100 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎన్.సత్యనారాయణ, బీజేపీ నేతలు అడపా శోభారాణి, కొయ్య వెంకటసుబ్బారావు, దండు రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

- ఆలయాల్లో సరస్వతీ దేవి పూజలు
- వందలాదిగా విద్యార్థుల పూజలు, అక్షరాభ్యాసాలు



పెదవేగి: ప్రత్యేక పూల అలంకరణలో రాట్నాలమ్మ



నిడమర్రు: సరస్వతీదేవిగా అమ్మవారు



భీమడోలు: సరస్వతీదేవిగా భవానమ్మ



ఉంగుటూరు: శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



భీమడోలు: పూజలు చేస్తున్న మహిళలు

భీమడోలు: దేవి నవరాత్రి ఉత్సవాలు ఎనిమిదో రోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పంచామృత నవరసఫల అభిషేకాలు, స్త్రీలచే కాత్యాయని వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు సామూహికంగా సరస్వతీ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, ఎంఎంపురం, అంబర్‌పేట, కోడూరుపాడు, వడ్లపట్ల, కొల్లేరు గ్రామాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు విశేష పూజలు చేశారు. భీమడోలు గ్రామంలోని రావిచెట్టు, పోస్టాఫీసు రోడ్డు, భీమడోలు జంక్షన్‌లో ఉత్సవ విగ్రహాలవద్ద భక్తులు పూజలు చేశారు. గుండుగొలనులో భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. బాల బాలికలు సామూహిక సరస్వతీ పూజలు చేశారు. ఆలయ పూజారులు లంకా శివకుమార్‌శర్మ, లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం భవానమ్మ ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నిడమర్రు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం సరస్వతీ దేవి అవతారంలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. అడవికొలను శ్రీకేశవ స్వామి ఆలయంలో పండితులు చక్రవర్తుల సుబ్బారావు ఆధ్వర్యంలో, బువ్వనపల్లి గ్రామ దేవత శ్రీవడలమ్మ అమ్మవారి ఆలయంలోనూ చిన్నారులతో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. పెదనిండ్రకొలను దుర్గాదేవి పీఠంలోనూ, మందలపర్రులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలోని ఉమాదేవిని సరస్వతీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సరస్వతి దేవి అలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి: దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీరాట్నాలమ్మను సోమవారం సరస్వతీదేవిగా అలంకరించారు. పెద వేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వెలసిన రాట్నాలమ్మ దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు.

ప్రత్యేక పూజలు

దెందులూరు: వాడవాడలా దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. గోపన్నపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో మాజీ సర్పంచ్ ఆలయ కమిటీ సభ్యులు హనుమంతు, తోట రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సీతంపేట గ్రామంలో అంకె ప్రసాద్, పరసఏడుకొండలు, బాలిన బాబు, కోకిరాల చిట్టి, వెలివెల శివ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

గ్లూకోజ్, పండ్లు పంపిణీ

దెందులూరు: ఆధ్యాత్మిక సేవకుల సేవ దేవుని సేవతో సమానమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల మాజీ వైస్ చైర్మన్ ఏనుగు రామలింగేశ్వరరావు అన్నారు. సోమవారం గోపన్నపాలెం గ్రామానికి చెందిన శ్రీదేవి శ్రీవల్లి మోటార్స్ కొండేటి మనోహర్ పలు ప్రాంతాల నుంచి కాలి నడకన విజయవాడ వెళ్లే భవానీ మాలధారులకు గ్లూకోజ్ ప్యాకెట్లు, పండ్లు అందజేశారు.

సరస్వతీదేవి పూజలో విద్యార్థులు

ఉంగుటూరు: స్థానిక శివాలయంలో నెలకొల్పిన కనకదుర్గమ్మ విగ్రహం వద్ద విద్యార్థులచే సరస్వతీపూజలు నిర్వహించారు. సోమవారం ఆలయట్రస్టీ బోర్డు చైర్మన్ నారాయణం హనుమంతురావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కైకరం విజ్ఞాన భారతి స్కూల్‌లో సరస్వతిపూజలు నిర్వహించారు.



నిడమర్రు: సరస్వతీదేవి పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



దెందులూరు: భవానీ మాలధారులకు గ్లూకోజ్, పండ్లు పంపిణీ చేస్తున్న కొండేటి మనోహర్



దెందులూరు: సరస్వతీదేవి పూజలు చేస్తున్న విద్యార్థులు

అంబేడ్కర్ జీవిత చరిత్రపై నాటిక ప్రదర్శన



కళాకారుడిని సత్కరిస్తున్న నేతలు

భీమడోలు: సామాజిక పోరాటమే లక్ష్యంగా తన జీవితాన్ని గడిపిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఆదివారం రాత్రి నిర్వహించిన నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి వారిచే 770వ ఉచిత నాటిక ప్రదర్శన నిర్వహించారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవితంపై బుద్ధం శరణం గచ్ఛామి అనే నినాదంతో స్ఫూర్తిదాయక నాటిక ప్రదర్శన ఆకట్టుకుంది. అంబేడ్కర్ మిషన్ రాష్ట్ర నాయకులు సిర్రా భరత్ మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితంపై చేసిన నాటిక ప్రదర్శన విజయవంతమైందన్నారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు. సీపీఎం జిల్లా నాయకులు ఆర్.లింగరాజు, అంబటి నాగేంద్ర ప్రసాద్, పాము మాన్‌సింగ్, ముళ్లగిరి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

తేరా ప్రసాద్‌కు ఘన సన్మానం

భీమడోలు: రాష్ట్ర స్థాయి ఉత్తమఉపాధ్యాయ అవార్డు గ్రహీత తేరా ప్రసాద్‌ను సోమవారం భీమడోలు పంచాయతీ పరిధిలోని నరెడ్లగూడెం చర్చిలో ఘనంగా సత్కరించారు. ఏలూరు మండలానికి చెందిన మాస్టర్ తేరా ప్రసాద్‌కు సెప్టెంబర్ 5వ తేదీన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో తేరా ప్రసాద్‌ను సంఘం పెద్దలు, విశ్వాసులు ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.